

ఇచ్చోడ పోలీస్‌స్టేషన్‌లో గంజాయి మొక్కలను పరిశీలిస్తున్న ఎస్పీ



ఇచ్చోడ మండలం సల్యాదాలో గంజాయి మొక్కలను తొలగిస్తున్న పోలీసులు

గంజాయి కలకలం!

- స్మగ్లర్ల మాయ మాటలు నమ్మి అంతర పంటగా గంజాయి సాగు
- పోలీసుల కంటపడి నలుగురు గిరిజన రైతులు కటకటాల పాలు
- చట్టాలపై అవగాహన లేక ఆగమైపోతున్న రైతులు
- తప్పించుకుంటున్న అసలు సూత్రధారులు
- పరిశీలించకుండానే వ్యవసాయ శాఖ అధికారుల పంటల సర్వే

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయమే ప్రధాన జీవనాధారమైన జిల్లాలో గంజాయి సాగు వెలుగు చూడడం సర్వత్రా కలకలం రేపుతోంది. గుట్టు చప్పుడు కాకుండా మారుమూల గిరిజన గ్రామాల్లో అంతర్‌పంటగా గంజాయిని సాగుచేస్తూ రైతులు కటకటాల పాలవుతున్నారు. ఎలాంటి కష్టం, పెట్టుబడి లేకుండానే సులువుగా లక్షలు సంపాదించవచ్చని భావిస్తున్న అమాయక రైతులు అత్యాశతో నిషేధిత గంజాయి పంటను సాగు చేస్తూ పోలీసులకు పట్టుబడుతున్నారు. ఇన్నాళ్లు కుటుంబంతో వ్యవసాయ పనుల్లో కనిపించిన రైతులు.. అక్రమ కేసుల్లో ఇరుక్కుని జైలు పాలవుతున్నారు. ఆర్థిక ఇబ్బందులు, అమాయకత్వం, చట్టాలపై అవగాహనలేని రైతులను స్మగ్లర్‌లు నిషేధిత గంజాయి ఉచ్చులో దింపుతున్నారు. 'దొరికితే దొంగ.. లేదంటే దొర' అన్నచందంగా గంజాయి సాగు వ్యవహారం కనిపిస్తోంది. జిల్లా రైతులు వానాకాలం, యాసంగి సీజన్‌లలో వివిధ రకాల పంటలను సాగు చేస్తారు. ముఖ్యంగా పత్తి, కంది, సోయా, జొన్న, మొక్కజొన్న పంటలు సాగవుతాయి. ప్రతిఏటా అంతర్ పంటగా గంజాయిని సాగుచేస్తున్న దాఖలాలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. వర్షాకాల సీజన్ నుంచి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా గంజాయిని సాగు చేసిన 25 మంది రైతులపై కేసులు నమోదయ్యాయి. తాజాగా ఇచ్చోడ మండలం సల్యాల గ్రామానికి చెందిన నలుగురు గిరిజన రైతులపై గంజాయి కేసులు నమోదు కావడం చర్చనీయాంశంగా మారింది. పట్టుకున్న గంజాయి విలువ రూ.18లక్షల వరకు ఉంటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు. ఎవరికి అనుమానం రాకుండా మారుమూల గ్రామాల్లో గంజాయిని సాగుచేస్తున్న అధికారుల కంటపడి అడ్డంగా దొరికిపోతున్నారు. గ్రామాల్లో గంజాయి సాగు కేసులు పునరావృతమవుతూనే ఉన్నాయి. ఇకనైనా క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తే గంజాయి సాగుకు కొంత వరకైనా అడ్డుకట్టపడే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రైతులకు ఆశచూపుతూ అడ్వాన్సులు

నిషేధిత గంజాయిని సాగుచేస్తున్న రైతులు జైలు పాలవుతున్నా.. అసలు సూత్రధారులు మాత్రం తప్పించుకుంటూ తిరుగుతున్నారు. అమాయక రైతులకు అడ్వాన్సుల రూపంలో డబ్బులను ఆశచూపుతూ ఉచ్చులో దింపుతున్నారు. తెరవెనకుండి స్మగ్లర్‌లు ఈ తతంగాన్ని నడిపిస్తున్నా.. దొరికిపోతే తమకేమీ సంబంధం లేదన్నట్లుగా తెలివిగా వ్యవహరిసున్నారు. రైతులు సాగుచేస్తున్న గంజాయిని కొనుగోలు చేసేందుకు స్మగ్లర్‌లు ముందే ఒప్పందం చేసుకుంటున్నారు. దీంతో రైతులు గంజాయిని సాగు చేసేందుకు ముందుకు వస్తున్నట్లు తెలుస్తోంది. అత్యవసరాలకు అడ్వాన్సులు ఇస్తూ రైతులను ఇరికిస్తున్నారు. గ్రామాల్లో కొందరు మధ్యవర్తులను నియమించుకొని స్మగ్లర్‌లు ఈ దందాను కొనసాగిస్తున్నట్లు తెలిసింది. రైతుల నుంచి నేరుగా కాకుండా మధ్య దళారుల ద్వారానే పండించిన గంజాయిని సేకరిస్తూ ఇతర రాష్ర్టాలకు తరలి స్తు సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటివరకు ఎందరో మంది రైతులపై గంజాయి కేసులు నమోదైన స్మగ్లర్‌లు తప్పించుకుంటున్నారు. ఇచ్చోడ మండల కేంద్రంగానే ఓ బడా వ్యాపారి కనుసనల్లోనే ఈ దందా కొనసాగు తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు ఇచ్చోడ మండలం చుట్టు పక్కల ఉన్న మండలాల్లోనే ఎక్కువ కేసులు నమోదవుతున్నాయి. నేరడిగొండ, బోథ్, బజార్‌హత్నూర్, గుడిహత్నూర్, ఇంద్రవెల్లి, సిరికొండ మండలాల్లోనే గంజాయి కేసులు ఎక్కువగా వెలుగు చూస్తున్నాయి.

> **పంట సర్వే చేసే సమయంలో గంజాయి మొక్కలు కనిపించలేదు..**
>
> **:సాయిరాం, ఏఈవో మల్యాల క్లస్టర్ ఇచ్చోడ**
>
> ఇచ్చోడ మండలంలోని సల్యాల గ్రామంలో పంటసర్వే చేసే సమయంలో గంజాయి మొక్కలు కనిపించలేదు. గ్రామాల్లో గంజాయి మొక్కలు సాగు చేయొద్దని పలుమార్లు అవగాహన సదస్సులు సైతం ఏర్పాటు చేశాం. పంట పొలాల్లో సర్వే కోసం వెళ్లినప్పుడు గంజాయి సాగు విషయం మా దృష్టికి రాలేదు.

పట్టుబడిన వారంతా గిరిజన రైతులే

గంజాయిని సాగుచేస్తూ పట్టుబడుతున్న వారంతా గిరిజన రైతులే కావడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. అసలే నిరక్షరాసులైన గిరిజన రైతులు అనవసరంగా గంజాయిని సాగుచేస్తూ కఠినమైన కేసుల్లో ఇరుక్కుటున్నారు. ఇచ్చోడ మండలం సల్యాడ గ్రామంలో జొన్న పంటలో అంతర పంటగా గంజాయి మొక్కలు పెంచుతున్న నలుగురు గిరిజన రైతులు పోలీసులకు పట్టుబడ్డారు. మొత్తం 180 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో చహకటి సోనేరావు, దుర్వ లవకుశ్, అర్క జంగుబాపు, దుర్వా అరుణ్‌లు ఉన్నారు. ఈ నలుగురు రైతులపై అండర్ సెక్షన్ 8(బీ) ఆర్/డబ్ల్యూ 20(ఏ)(ఐ) ఎన్‌డీపీఎస్ చట్టం1985 తో నాలుగు కేసులు నమోదు చేశారు. గంజాయి సరఫరా, స్మగ్లర్‌లు, వినియోగదారులను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. అలాగే ప్రత్యేకంగా ఏడీబీఎన్‌ఏబీ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఇలాంటి కఠినమైన చర్యలతో గంజాయి సాగు, అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడుతుందో లేదో వేచి చూడాల్సి ఉంది.

మొక్కుబడిగా పంటల సర్వే

వానాకాలం, యాసంగి సీజన్‌లో పంటల సర్వే ఆధారంగానే ప్రభుత్వం పంట దిగుబడులను కొనుగోలు చేస్తుంది. క్షేత్రస్థాయిలో రైతులు సాగు చేస్తున్న పంటలను పరిశీలించి వాటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంది. కానీ వ్యవసాయ శాఖ అధికారులు మొక్కుబడిగానే పంటలను సర్వే చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే అంచనాలకు మించి పత్తి పంటను కొనుగోలు చేసిన దాఖలాలు ఉన్నాయి. కంది సోయా శనగ జొన్న పంటల పరిస్థితి కూడా అదే విధంగా కనిపిస్తోంది. క్షేత్రస్థాయిలో అధికారులు పంటలను పరిశీలించి సర్వేను చేపడితే నిషేధిత గంజాయి మొక్కల సాగు ప్రారంభంలోనే కనిపెట్టి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. కానీ వ్యవసాయ శాఖ అధికారులు కార్యాలయాలకే పరిమితమవుతూ రైతుల ద్వారా వివరాలను సేకరించి నమోదు చేస్తున్నట్లు తెలుస్తోంది. వచ్చే వానకాల సీజన్‌లోనైనా క్షేత్రస్థాయిలో ఖచ్చితమైన పరిశీలన చేసిన తర్వాతనే పంటల వివరాలను నమోదు చేస్తే నిషేధిత గంజాయి సాగుకు గుర్తించి అడ్డుకట్ట వేసే అవకాశం ఉంటుంది.

పారదర్శకంగా బార్ల టెండర్ ప్రక్రియ

● కలెక్టర్ రాజర్షిషా



లక్కీడ్రాలో ఎంపికైన వారికి పత్రాలు అందజేస్తున్న కలెక్టర్

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : గతంలో రెన్యువల్ కానీ మూడుబార్ షాపుల కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు కేటాయింపుప్రక్రియను పారదర్శకంగా నిర్వహించామని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. జిల్లా కేంద్రంలో రెన్యువల్ చేసుకోని మూడుషాపులకు గాను గతంలో దరఖాస్తులు స్వీకరించారు. కాగా దీనికి 61 మంది దరఖాస్తులు చేసుకోగా మంగళవారం మూతబడిన బార్లస్థానంలో బార్ల ఏర్పాటుకు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియకు లక్కీడ్రా నిర్వహించారు. అభ్యర్థుల సమక్షంలోనే టోకెన్లను పరిశీలించి కలెక్టర్ డ్రా తీసి ఎంపికైన వారికి పత్రాలను అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ... పట్టణ పరిధిలో మూడుబార్‌షాపులు రెన్యువల్ చేసుకోలేదన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు టెండర్ ప్రక్రియను నిర్వహించామని తెలిపారు. దీనికి గాను 61 మంది దరఖాస్తులు చేసుకోగా లక్కీడిప్ ద్వారా కేటాయించామన్నారు. విజయవంతంగా అభ్యర్థుల సమక్షంలోనే పారదర్శంగా నిర్వహించామని, లక్కీ లాటరీ ప్రక్రియలో విక్రంనాయక్, జైస్వాల్ శుభం, కళ్యాణి బార్లను దక్కిం చుకున్నారన్నారు. వీడియోగ్రఫీ ద్వారా ప్రశాంతంగా టెండర్ ప్రక్రియ పూర్తయిందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ హేమశ్రీ, ఎక్సైజ్ సీఐ విజేందర్ పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో నిబంధనలు పాటించాలి

● డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తప్పవని డీఎంహెచ్ డా.నరేందర్ రాథోడ్ స్పష్టం చేశారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులను పోలీసు, సఖీ, ఎన్‌జీఓ, రిమ్స్ ప్రతినిధులతో ఏర్పాటైన బృందంతో కలిసి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రులలో వసతులు, వైద్యుల వివరాలు, లింగనిర్ధారణ, ధరలు, ఫైర్ సెఫ్టే, రిజిస్ట్రేషన్ తదితర వాటిని పరిశీలించారు. రిజిస్టర్ అయిన ఆస్పత్రులు నిబంధనలు తప్పక పాటించాలన్నారు. రోగులు, వారి సహాయకులకు కనిపించేలా ప్రతి ఆస్పత్రిలో రేటు చార్జీలు రెండు భాషల్లో బోర్డులను పేషంట్ వెయిటింగ్ ఉండే చోట పెట్టాలన్నారు. అధిక ఫీజులు తీసుకుంటే చర్యలు తప్పవన్నారు. ఎండాకాలంలో అగ్నిప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ఫైర్‌సెఫ్టీ ఏర్పాటులో నిర్లక్ష్యం చేయవద్దని తెలిపారు. క్రాంతి, యశోద, సరస్వతి పాల్గొన్నారు.



బాక్స్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ నరేందర్ రాథోడ్

భూభారతి చట్టంతో రైతుల భూ సమస్యలకు సత్వర పరిష్కారం

● జిల్లా కలెక్టర్ రాజర్షిషా



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా

తలమడుగు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన భూభారతి చట్టం ద్వారా రైతుల భూ సమస్యల సత్వర పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం మండలంలోని ఉండం గ్రామంలోని అయుష గార్డెన్‌లో ఏర్పాటు చేసిన భూభారతి అవగాహన సదస్సులో కలెక్టర్ మాట్లాడుతూ కొత్త భూ భారతి చట్టంలో రైతుల సమస్యల పరిష్కారానికి రూపొందించిన చట్టమని, అందరికీ న్యాయం జరిగేలా చట్టం రూపొందించామని రైతులు ఎవరూ కూడా ఆందోళన చెందనవసరం లేదన్నారు. రైతుల భూ సమస్యలకు పరిష్కారం దొరుకుతుం దని అన్నారు. నూతన చట్టం ఏప్రిల్ 14వ తేదీన అమలులోకి వచ్చిందని, దీని ఫలితంగా తెలంగాణ రెవెన్యూ వ్యవస్థలో కీలక మార్పులు చోటుచేసు కున్నాయన్నారు. దరణి స్థానంలో భూ భారతి పోర్టల్ అందుబాటులోకి వచ్చిందని, భూ భారతి పోర్టల్ ద్వారానే క్రయవిక్రయాలు జరుగుతాయన్నారు. ఈ చట్టంలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయని భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తు చేసుకోవడానికి గతంలో పోర్టల్లో 33 మాడ్యూళ్లు ఉండేవి. అయితే భూ భారతిలో ఈ విధానాన్ని సులభతరం చేశారని, మాడ్యూళ్ల సంఖ్యను 33 నుంచి ఆరుకు కుదించారన్నారు. ఈ నూతన చట్టం ప్రకారం మ్యుటేషన్కు మ్యాప్ తప్పనిసరిగా ఉంటుందని, వారసత్వ భూముల విషయంలో తప్పులు జరగకుండా చర్యలు, క్షేత్రస్థాయి విచారణ తర్వాతే ప్రక్రియ ముందుకు సాగుతుందని, నిర్దీత కాలంలో విచారణ చేసిన తర్వాతనే పాస్‌పుస్తకాలు జారీ అవుతాయన్నారు. అదేవిధంగా ఏజెన్సీ ప్రాంతంలోని భూముల సమస్యలకు ప్రభుత్వదృష్టికి తీసుకెళ్లామన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న భూభారతి చట్టాన్ని రైతులు సద్వినియోగ పరుచుకోవాలన్నారు. దరఖాస్తులను నెల రోజుల వరకు వాటిని పరిశీలించేందుకు చర్యలు చేపడ తామన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్యామ లాదేవి, డీసీసీబీ చైర్మన్ భోజరెడ్డిలు మాట్లాడుతూ భూ భారతి చట్టంలో భూమి హక్కులు భద్రం, భూ సమస్యల సత్వర పరిష్కారం కోసం రైతు మేలు కోసం ప్రజాపాలనలో చారిత్రక మార్పువచ్చిందని వెల్లడించారు. ఈ చట్టం ద్వారా అనేక సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. రికార్డులలో తప్పుల సవరణ, వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ , వారసత్వంగా వచ్చిన భూముల మ్యుటేషన్, ఇతర మార్గాల ద్వారా వచ్చిన భూములకు మ్యుటేషన్, సాదా బైనామా క్రమబద్ధీకరణ, పట్టాదారు పాసుపుస్తకాలు, అప్పీలు వ్యవస్థ, రివిజన్ అధికారాలు, గ్రామ రెవెన్యూ రికార్డుల, రికార్డుల నకలు పొందడం ఎలా ఈ అంశాల పై చట్టం రుపు దాల్చిందని, ఈ కొత్తచట్టంపై అందరికీ అర్థమయ్యేలా అవగాహన సదస్సులు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సలోని, తహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీవో చంద్రశేఖర్, సహకార సంఘం చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, తలమడుగు సహకార సంఘం ఇంచార్జి చైర్మన్ పద్మాకర్ రెడ్డి, వ్యవసాయ అధికారి ప్రమోద్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, రెవెన్యూ అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో పంచాయతీ కార్మికుడి మృతి

● డీపీఓ ఆఫీస్ ఎదుట మృతదేహంతో నిరసన



ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : కరెంట్‌షాక్‌తో మృతిచెందిన పంచాయతీ కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలని బాధిత కుటుంబసభ్యులు డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం ఈదులసావర్గాంకు చెందిన జీపీ కార్మికుడు ఇటీవల కరెంట్ స్తంభం ఎక్కి పనులు చేస్తున్న క్రమంలో కరెంట్‌షాక్‌కు గురయ్యాడు. రిమ్స్‌లో చికిత్సపొందుతూ మంగళవారం మరణించాడు. అయితే బాధిత కుటుంబాన్ని ఆదుకో వాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ, ఎమ్మార్పీస్, దళిత సంఘాల ఆధ్వర్యంలో మృతదేహంతో డీపీఓ కార్యాలయంలో ధర్నా నిర్వహించారు. టూటౌన్ సీఐ కరుణకర్ అక్కడి చేరుకొని సముదాయించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకునేలా స్పష్టమైన హామీ వచ్చే వరకు కదిలేది లేదని భీష్మించుకుకుర్చున్నారు. డీఎస్పీ జీవన్ అక్కడికి చేరుకొని ఎలాంటి అనుమతి లేకుండా ప్రభుత్వం కార్యాలయంలో శవంతో ధర్నా చేస్తున్న నాయకులను అరెస్ట్ చేశారు. దీంతో అక్కడ కాసేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. కాగా బాధిత కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు ఒకరికి ఉద్యోగం, పిల్లల చదువు బాధ్యత తీసుకోవాలని వివిధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆశన్న, లంక రాఘవులు, అజయ్, అరెల్లి మల్లేష్, అగ్గిమల్ల స్వామి పాల్గొన్నారు.

జొన్నల కొనుగోళ్లలో అక్రమాలకు పాల్పడవద్దు

● ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

ఉట్నూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : రైతుల ప్రయోజనం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న జొన్నల కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి అక్రమాలకు పాల్పడవద్దని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. మంగళవారం మండలంలోని నాగపూర్ దాల్‌మిల్ వద్ద ప్రజా మిత్ర సహకార సంస్థ, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అదేవిధంగా సహకార మిత్ర ఆధ్వర్యంలో రూ.లక్షతో కొనుగోలు చేసిన భూసారం పరీక్ష యంత్రాన్ని సైతం ప్రారంభించారు. రైతులు పండించిన జొన్నలు మాత్రమే కొనుగోలు చేసి రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వాలని, దళారులు తెచ్చే జొన్నలను కొనుగోలు చేయవద్దని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధర క్వింటాలుకు రూ.9949, ఈ ప్రాంతంలో 11,410 ఎకరాలలో జొన్న పంట సాగు చేయడం జరిగిందని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర చెల్లించి రైతులకు ప్రయోజనం కలిగించాలన్నారు.

రైతులకు అందుబాటులో భూసారం పరీక్ష యంత్రం..

సహకార మిత్ర ఆధ్వర్యంలో ఈ ప్రాంత రైతులకు ప్రయోజనం కలిగించడానికి మట్టి పరీక్ష యంత్రం కొనుగోలు చేయడం హర్షనీయమన్నారు. రైతులు తమ పంటల్లోని భూసారాన్ని పరీక్షలు చేయించుకొని ఈ పంటకు భూమి అణువుగా ఉంటే ఆ పంటలు పండించి దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్, వైస్‌చైర్మన్ బానోత్ వసంత రావు, మండల వ్యవసాయ అధికారి గిత్తే రమేష్, ఏఈఓ మహేష్, సహకార మిత్ర మేనేజర్లు కొమ్ర విఠల్, రాథోడ్ శేష రావు, మాజీ సర్పంచ్‌లు మరుసుకోలా తిరుపతి, జగదీష్ జాదవ్, సిడాం గంగాధర్, రామిని ప్రశాంత్, మానాల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనపై ప్రత్యేక దృష్టి : ఎస్పీ



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఇచ్చోడ, ఏప్రిల్, 29 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లా ప్రజలు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, జిల్లాలో గంజాయి నిర్మూలనపై ప్రత్యేకదృష్టి చేపట్టామని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మంగళవారం ఇచ్చోడ మండల కేంద్రంలోని సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోమవారం ఇచ్చోడ మండలంలోని చిన్న సల్యాద గ్రామశివారులో అక్రమంగా పంటపొలంలో అంతరపంటగా గంజాయి సాగు చేస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేయించగా నలుగురి పంట పొలాల్లో 180 గంజాయి మొక్కలు లభ్యమయ్యాయి. వాటి విలువ బహిరంగ మార్కెట్లో 18 లక్షల వరకు ఉంటుందని అంచనా వేశారు. ఆదిలాబాద్ జిల్లాలో గంజాయి లభించకుండా, పండించకుండా, వినియోగించకుండా చూస్తామని పేర్కొన్నారు. ఈ మేరకు గ్రామానికి చెందిన గంజాయి సాగుచేస్తున్న చహకటి సోనేరావ్ పొలంలో 17 మొక్కలు, దుర్వా లవకుష్ పొలంలో 86 మొక్కలు, అర్క జంగుబాపు పొలంలో 31 మొక్కలు, దుర్వా అరుణ్ పొలంలో 46 గంజాయి మొక్కలను పెంచినట్లు వివరాలను వెల్లడించారు. మాదకద్రవ్యాలపై ఎలాంటి సమాచారం ఉన్నా మెసేజ్ యువర్ ఎస్పీ 8712659973 నంబరుకు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. గంజాయి సాగు చేసిన వారికి ప్రభుత్వ పథకాలు రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకోవడంలో కష్టపడ్డ సిబ్బందికి ఎస్పీ అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్, సీఐ భీమేష్, ఎస్సై తిరుపతి సిబ్బంది తదిత రులు పాల్గొన్నారు.

సైబర్ సెల్, ఐటీ కోర్ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎస్పీ

ఆదిలాబాద్ పోలీసు ముఖ్య కార్యాలయంలో నూతనంగా సైబర్ సెల్ ఐటీ కోర్ కార్యాలయాన్ని ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రారంభించారు. యూనిఫాం వేసుకున్న పోలీసు సిబ్బంది ప్రజలకు ఒకవైపు కనిపిస్తుండగా మరోవైపు సిబ్బంది పోలీసు వ్యవస్థకు వెన్నెముకలా పనిచేస్తుందన్నారు. లా అండ్ ఆర్డర్ కంట్రోల్, నేరస్తులను కనుగొనడంలో, నేరాలు జరగకుండా నియంత్రించడానికి తోడ్పడుతుందని కొనియాడారు.

ఇచ్చోడ : పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ త్వరితగతిన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మంగళవారం ఇచ్చోడ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ అవరణలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న వాహనాల ప్రస్తుత పరిస్థితులను తెలుసుకుని త్వరితగతిన కేసుల పురోగతిని తెలుసుకుని తదుపరి కార్యచరణను అనుసరించాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిశుభ్రతగా ఉంచుతూ.. నవీకరించుకోవాలని సూచించారు. అత్యవసర సమయంలో సిబ్బంది అందుబాటులో ఉంటే అప్రమత్తంగా ఉండాలని, అవాంఛనీయ సంఘటన చోటుచేసుకున్నప్పుడు నిమిషాల వ్యవధిలో సంఘటన స్థలాలకు చేరుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను స్వయంగా పరిశీలించారు. ఆయన వెంట ఏఎస్పీ కాజల్‌సింగ్, సీఐ భీమేష్, ఎస్సై తిరుపతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అవినీతిని ప్రశ్నిస్తే అరెస్టు చేశారు : రూపేష్ రెడ్డి



కోర్టుకు హాజరైన రూపేష్ రెడ్డి తదితరులు

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : బేల మండలంలోని సాంగిడి గ్రామంలో ఉపాధి హామీ పథకంలో అవినీతి జరిగిందని ఆరోపిస్తే అప్పటి బీఆర్ఎస్ అధికార పార్టీ నాయకులు పోలీసులతో అరెస్ట్ చేయించి కేసులు నమోదు చేశారని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు రూపేష్ రెడ్డి ఆరోపించారు. దీంతో 2020 సంవత్సరంలో తమపై అక్రమ కేసులు పెట్టారన్నారు. తమ వాదనలు వినిపించడానికి మంగళవారం జిల్లా కోర్టుకు హాజరయ్యామన్నారు. కోర్టుకు హాజరైన వారిలో కదరపు ప్రవీణ్, సామ నర్సారెడ్డి, కైపెల్లి నర్సింగ్, ఏలల్ దివాకర్ రెడ్డి, సునీల్, మేకల జితేందర్, పసల ఆశన్న, జనార్ధన్, సుభాష్, రామోతర్ ఉన్నారు.

డీఎంహెచ్‌ఓకు ఏసీబీ పేరిట ఫేక్ కాల్

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ డీఎంహెచ్‌ఓ నరేందర్ రాథోడ్‌కు మంగళవారం ఏసీబీ అధికారి అంటూ ఓ ఫోన్ కాల్ వచ్చింది. ఓ అపరిచిత వ్యక్తి కాల్ చేసి తాము ఏసీబీ అధికారులమంటూ.. మీరు ఎన్ని సంవత్సరాలుగా పనిచేస్తు న్నారు..? ఏంటి అనే వివరాలను అడిగారు. మీ పేరేంటి అని అవతల వ్యక్తిని డీఎంహెచ్‌ఓ అడగగా.. మీరు ఇన్ని సంవత్సరాలుగా ఉద్యోగం చేస్తున్నారు మీకు ఏసీబీ అధికారులు ఎవరో కూడా తెలియదా..? అంటూ అవతల వ్యక్తి మాట్లాడి ఫోన్ పెట్టేసినట్లు డీఎంహెచ్‌ఓ నరేందర్ రాథోడ్ వెల్లడించారు. ఈ విషయమై స్థానిక ఏసీబీ అధికారులను సంప్రదించగా.. తమ ఏసీబీ శాఖ నుంచి అలా ఫోన్ కాల్స్ రావని.. ఫేక్ కాల్స్ పట్ల అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

గాంధీ పార్క్‌లో అభివృద్ధి పనులు



పనులను పరిశీలిస్తున్న అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని గాంధీ పార్క్‌లో నెలకొన్న సమస్యలతో సందర్శకులకు అందని ఆహ్లాదంపై.. అస్త వ్యస్తంగా గాంధీపార్క్..' శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. కథనానికి సంబంధిత అధికారులు తక్షణమే స్పందించారు. ఈ మేరకు గాంధీపార్కును వారు సందర్శించి పార్కులో పనిచేయని ఫౌంటెన్‌లు, వివిధ పరికరాలకు మరమ్మతులు చేపట్టారు. అదేవిధంగా పార్కులో పచ్చదనం ఉండేలా మొక్కలకు నీరందించేలా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో డీఈఎస్‌ఓ వెంకటేశ్వర్లు, మున్సిపల్ ఇంజనీర్ పేరిరాజు, మసూద్, ప్రశాంత్ పాల్గొన్నారు.

లబ్ధిదారుల గృహాలను పరిశీలించిన అధికారులు



నివాస గృహాలను పరిశీలిస్తున్న అధికారులు

బోథ్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్లపల్లి గ్రామంలో మంజూరు అయిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల గృహాలను మంగళవారం ఎంపీ ఈవో అతుల్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారి ఆర్థిక పరిస్థితులను పరిశీలించారు. వారికి ఇంటి నిర్మాణానికి అవసరమైన స్థలం విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శి కాశీరాంతోపాటు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు అనిల్ అప్ప పాల్గొన్నారు.

ఆలాలాబాద్ వన్‌టౌన్‌లో ఇద్దరిపై కేసు

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ వన్ టౌన్‌పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు నమోదు చేసినట్లు డీఎస్పీ జీవన్ రెడ్డి తెలిపారు. షేక్‌ఇర్ఫాన్ మన్నాన్ అనే రౌడీ షీటర్ సిగరేట్ తాగుతూ, రాష్ డ్రైవింగ్ చేస్తూ సోషల్ మీడియాలో పోస్ట్‌చేశాడు. అతడిని పోలీస్ స్టేషన్‌ను తీసుకురాగా అనుమానంతో గంజాయి టెస్ట్ చేయగా నిర్ధారణ అయింది. దీనిపై కేసు నమోదు చేశారు. మరో కేసులో ఎగ్గిబిషన్ వ్యాపారిని సయ్యద్ మోసిన్ అనే వ్యక్తి డబ్బులు కావాలంటూ బెదిరించడంతో అతడిపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తాంసి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సావర్గావ్ గ్రామానికి చెందిన గజకంటి ప్రభాకర్ (45) అనే వ్యక్తి ఈనెల 17న విద్యుత్ స్తంభం నుంచి పడి గాయాలపాలయ్యాడు. వెంటనే జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ప్రభాకర్ మంగళవారం మృతిచెందినట్లు తాంసి ఎస్సై రాధిక తెలిపారు. మృతుడి భార్య కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె వివరించారు. మృతుని కుటుంబాన్ని విద్యుత్‌శాఖ ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మోసం చేసిన వ్యక్తి అరెస్టు

మావల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నమ్మించి డబ్బులు వసూలు చేసి మోసం చేసిన ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ ఫణిందర్ తెలిపారు. పట్టణంలోని రాంనగర్‌కి చెందిన రిటైర్డ్ బీఎస్ఎన్ఎల్ ఉద్యోగికి గుర్తుతెలియని వ్యక్తి ఫోన్‌చేసి రూ.ఐదులక్షల విలువ చేసే ఫర్నిచర్ ఉందని, అతి తక్కువ ధరకు ఇచ్చేస్తానని నమ్మించాడు. అందుకు 20 వేలు అడిగాడు. అయన మాటలు నమ్మి రూ.18 వేలు చెల్లించాడు. తీరా ఫోన్‌స్విచ్ ఆఫ్ పెట్టేయడంతో మోసపోయానని మావల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఇచ్చోడ మండలానికి చెందిన మల్లేష్‌గా గుర్తించారు. ఈమేరకు మల్లేష్‌ను అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఇందులో ఎస్సై విష్ణువర్ధన్, పోలీసుసిబ్బంది ఉన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి పట్టివేత



గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పట్టుకున్న పోలీసులు

భైంసా, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి ఒకరిని మంగళవారం పట్టుకున్నట్లుగా భైంసా టౌన్ సీఐ గోపినాథ్ తెలిపారు. సీఐ తెలిపిన కథనం ప్రకారం మహారాష్ట్రలోని నాసిక్ జిల్లా మాలేగామ్ ప్రాంతానికి చెందిన ముజామ్మిల్ హుస్సైన్ అనే వ్యక్తి గత కొంత కాలంగా భైంసాలోని ఓవైసీ నగర్ కాలనీ పరిధిలో నివాసముంటు నిషేదిత గంజాయి విక్రయాలు చేపడుతున్నారు. మంగళవారం భైంసా టౌన్ ఎస్ఐ గణేష్, హెడ్ కానిస్టేబుల్ ఆహ్మద్, కానిస్టేబుళ్ల ప్రమోద్, శరత్, హరిబాబ, బాలాజీ నేతృత్వంలోని పట్టణ పోలీసు బృందంతో పాటు నిర్మల్ జిల్లా క్లూస్ టీం సంయుక్తంగా దాడి చేపట్టింది. ఇందులో బైపాస్ రోడ్డు మార్గంలో ముజామిల్ హుస్సేన్ ఒక కిలో 140 గ్రాముల ఎండు గంజాయితో పట్టుబడ్డాడు. సంబంధిత నిందితుని వద్ద నుంచి ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లుగా సీఐ గోపినాథ్ పేర్కొన్నారు,

భూ భారతితో సమస్యలకు సత్వర పరిష్కారం



రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

దిలావర్‌పూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : భూ భారతి చట్టంతో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని దిలావర్‌పూర్ డిప్యూటీ తహసీల్దార్ రమేష్ అన్నారు. మంగళవారం మండలంలోని కాల్వ గ్రామంలో భూ భారతి చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని అన్నారు. రైతులు భూ భారతి చట్టాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా భూ సమస్యలన్నీ పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పంచాయతీ కార్యదర్శి కిరణ్, రైతులు పాల్గొన్నారు.

మహారాష్ట్ర నుంచి జొన్నల తరలింపు.. అడ్డుకున్న పోలీసులు



పోలీసు స్టేషన్‌లో ఉంచిన జొన్నల వ్యాన్

బోథ్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మేలుచేయాలన్న దృక్పథంతో జిల్లాలో ఆదిలాబాద్, బోథ్, ఇచ్చోడ, బజార్‌హత్నూర్, సోనాల, దన్నూర్ గ్రామాలలో జొన్న పంట మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తు న్నారు. అయితే ఎకరానికి 14క్వింటాళ్ల దిగుబడి అంచనాతో 3వేల 371 రూపా యలకు క్వింటాలుగా కొనుగోలు చేస్తున్నా రు. అయితే మహారాష్ట్రలో పండించిన జొన్నలను కొంతమంది దళారీలు రైతుల ముసుగులో తరలించి విక్రయాలకు పాల్పడుతున్నారు.

● **క్వింటాలుకు వెయ్యి రూపాయల లాభంతో..**

మహారాష్ట్రలో క్వింటాలు జొన్నలు 2003 వందల రూపాయలకు దొరకడంతో కొంత మంది వ్యాపారులు రైతుల ముసుగులో స్థానిక మార్కెట్లకు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. అడ్డదారుల్లో కొనుగోలు సెంటర్లకు పంపించి విక్రయిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. గత ఏడాది కొందరు 500 నుంచి వెయ్యి క్వింటాళ్ళ వరకు రైతుల తీరిన విక్రయాలు చేపట్టడం జరిగింది. అయితే గత ఏడాది భారీగా డబ్బులు సంపాదించిన వారు ఈ ఏడాది సైతం అదే దందాలు చేస్తున్నట్లు పలువురు పేర్కొంటున్నారు.

● **పోలీసుల అదుపులో జొన్నల వ్యాన్**

బజార్‌హత్నూర్ కొనుగోలు కేంద్రానికి ఆదివారం అర్ధరాత్రి సమయంలో మహారాష్ట్ర నుంచి జొన్నలు వస్తున్నాయి. అన్న పక్కా సమాచారంతో పోలీసులు జొన్నలతో కూడిన వాహనాన్ని పట్టుకున్నారు. అయితే పట్టుబడిన వాహనాన్ని సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. ఈ విషయమై బోథ్ సీఐ వెంకటేశ్వరరావును వివరణ కోరగా జొన్నలతో కూడిన వాహనాలు వస్తున్నాయని పక్కా సమాచారంతో తమ సిబ్బంది కాపు కాశారని మండలంలోని కొఠారి గ్రామం వద్ద వాహనాన్ని అదుపులోకి తీసుకున్నా మన్నారు. జొన్నలు ఎక్కడి నుంచి వచ్చాయని ఎవరు తీసుకువచ్చారనేది విచారిస్తున్నామన్నారు.

● **జోరుగా పైరవీలు**

పట్టుబడిన జొన్నల వాహనాన్ని విడిపించేందుకు మంగళవారం పలువురు రాజకీయ పార్టీల వారు తీవ్ర ఒత్తిళ్లు తీసుకువచ్చినట్లు తెలిసింది. ఏది ఏమైనా జొన్నల అక్రమ రవాణా జోరుగా సాగుతోందని పరిశీలకులు అంటున్నారు.

జొన్న పంట వేసినా రికార్డులకు ఎక్కలేదు..

● **అమ్మకానికి రైతుల ఇబ్బంది**

మర్లపల్లి గ్రామంలో జొన్న పంట వేసినా కొంతమంది రైతుల పేర్లు నమోదు కాలేదని దీంతో వారు పంట విక్రయానికి ఇబ్బం దులకు గురవుతున్నారని కాం గ్రెస్ నాయకులు పేర్కొన్నారు. పంట నమోదు సందర్భంగా పొరపాట్లు జరగడంతో తమ గ్రామ రైతులు పంట ఇబ్బందులు పడాల్సి వస్తుందని వాపోయారు. జిల్లా అధికారులు పంట సాగుచేసిన నమోదు కాని రైతుల పంట పొలాలను పరిశీలించి జొన్న పంట విక్రయించేందుకు అవకాశం కల్పించాలని ఆయన కోరారు.

నకిలీ ధ్రువపత్రాల కేసులో వేగవంతమైన విచారణ

● మీ సేవా కేంద్రాల్లో పోలీసుల తనిఖీలు

● డీటీ రామారావ్‌ను విచారించిన ఏఎస్పీ కాజల్‌సింగ్

ఇచ్చోడ, ఏప్రిల్, 29 (ఆంధ్రజ్యోతి) : నకిలీ ధ్రువీకరణ పత్రాలతో ఉద్యోగాలకు ఎంపికైన పలువురిపై రెవెన్యూ, పోలీసు అధికారులు విచారణను వేగవంతం చేస్తున్నారు. విచారణలో భాగంగా డీటీ జె.రామారావ్ సంతకంతో వెలువడిన నకిలీ నివాస ధ్రువపత్రాలు తాను ఇచ్చినవి కాదని 9 మందిపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్పీ కాజల్‌సింగ్ మంగళవారం రామారావ్‌ను పిలిపించి విచారణ చేపట్టినట్లు తెలిసింది. ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్రలకు చెందిన కొంతమంది యువకులు ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రంలోని మీసేవాల ద్వారా దరఖాస్తులు చేసుకున్నారు. నివాస ధ్రువీకరణ పత్రాల కోసం ఆధార్, రేషన్ కార్డులు జతచేశారు. ఈ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలిస్తే ఆధార్ కార్డులో పుట్టిన తిథి అని ఉంది. తెలంగాణకు చెందిన ఆధార్‌కార్డులపై పుట్టిన రోజు అని ఉంటుంది. దీంతో వీరు ఇతర రాష్ట్రాలకు చెందిన వారుగా గుర్తించారు. నకిలీ పత్రాలు సృష్టించిన వారి స్థానంలో అసలు వ్యక్తుల సర్టిఫికెట్లను అధికారులు గుర్తించారు. ఫేక్ సర్టిఫికెట్ల వ్యవహారంపై పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. మీసేవా కేంద్రాలకు వెళ్లిన పోలీసులు యజమానులను విచారిస్తున్నారు.

గ్యాస్ సమస్యలపై లబ్ధిదారులు ఏజెన్సీలను కలవాలి

● ఎంపీడీవో జవహర్

నార్నూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు గృహ అవసరం నిమిత్తం వాడే గ్యాస్‌కు సంబంధించి సబ్సిడీ ఇతర సమస్యలు ఉంటే లబ్దిదారులు సంబంధిత ధ్రువపత్రాలు తీసుకొని వారి గ్యాస్ ఏజెన్సీ కార్యాలయానికి వెళ్లాలని ఎంపీడీవో జవహర్ అన్నారు. హెచ్‌పీ గ్యాస్ నార్నూర్ 9440327853, 9492700397, భారత్ గ్యాస్ ఉట్నూర్ 9381446072, ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ ఉట్నూర్ 9640944784, హెచ్‌పీ గ్యాస్ ఇంద్రవెల్లి 7569742107 నెంబర్‌లకు నేరుగా సంప్రదించాలన్నారు. అప్పుడు కూడా సమస్య పరిష్కారం కాకుంటే తమకు ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. బుధవారం ఉదయం 9 గంటలకు నార్నూర్ రైతు వేదికలో ప్రజా వేదిక ఉంటుందని, కార్యక్రమానికి జిల్లా పరిషత్ సీఈఓ, మండల ప్రత్యేక అధికారులు, వివిధ శాఖ అధికారులు పాల్గొంటారని తెలిపారు.

'ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనే రైతుల ఆత్మహత్యలు'



లింగన్న కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న విశారదన్

తలమడుగు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనే రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని బీసీ, ఎస్టీ, ఎస్సీ జేఏసీల రాష్ట్ర కన్వీనర్ విశారదన్ మహారాజ్ అన్నారు. లక్ష కిలోమీటర్ల పాదయాత్రలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని పలు వీధుల గుండా పాదయాత్ర చేపట్టారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. పేదలకు సేవలందించే ఆరోగ్య కేంద్రాలలో కనీస వసతులు లేవన్నారు. అరకొర సిబ్బంది మందులు ఇస్తున్నారన్నారు. అత్యవసర సేవలకు ప్రైవేట్ వైద్యులను సంప్రదించవలసిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. అనంతరం కేంద్రంలోని గ్రంథాలయాన్ని పరిశీలించి దశాబ్దాలుగా సొంత గ్రంథాలయ భవనానికి నోచుకోలేదన్నారు. అనం తరం ఇటీవల సుంకిడి గ్రామానికి చెందిన కుమ్మరి లింగన్న రైతు అప్పులబాధ తో మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సకాలంలో ప్రభుత్వం రైతులకు రుణమాఫీ. రైతుబంధు డబ్బులు అందించక పోవడంతో వ్యవసాయ పెట్టుబడుల కోసం రైతులు చేసిన అప్పులు తీరక రైతుల ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని బీసీ ఎస్టీ, ఎస్సీలందరూ ఏకం కావాలని కోరారు. ఇందులో గణేష్ రవికాంత్ యాదవ్, నేతుల గంగన్న, ఆసం రవి, అగ్గిమల్ల గంగన్న, బీసీ, ఎస్సీ, ఎస్టీల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

42 గ్రామపంచాయతీలకు రెండే బ్యాంకులు

● అవస్థలు పడుతున్న కుభీర్ మండల ప్రజలు ● ఖాతాల సంఖ్య పెరిగి బ్యాంకు ఉద్యోగులకు పనిభారం



కుభీర్‌లోని యూనియన్ బ్యాంకు

కుభీర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) దాదాపు 1980లో ఏర్పాటైంది. 12 సంవత్సరాల క్రితం తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఏర్పాటు చేశారు. ఈ రెండు బ్యాంకుల్లో ప్రస్తుతం 41వేల సేవింగ్ ఖాతాలు ఉన్నాయి. బ్యాంకులు రెండే ఉండటం అత్యధికంగా ఖాతాలు ఉంటడంతో అందులోని సిబ్బంది కూడా పనిఒత్తిడితో ఖాతాదారులకు సరిగ్గా సేవలందించ లేకపోతున్నారు. ఫలితంగా వివిధ గ్రామాల నుంచి బ్యాంకుకు వచ్చే గ్రామీణ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఒకటి గ్రామీణ బ్యాంకు మరొకటి నేషనల్ బ్యాంకు కావడంతో అందరు నేషనల్ బ్యాంకు వైపు మొగ్గు చూపడం కారణంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకులో స్థాయికి మించి ఖాతాలు పెరిగి పోతున్నాయి. దీంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకు స్థాయినైనా పెంచాలని లేదా మండలంలో మరో నేషనల్ బ్యాంకు ఏర్పాటు చేసి సేవలందించాలని మండల వాసులు కోరుతున్నారు. మండలంలో 42 గ్రామపంచాయతీలు వీటికి దాదాపు 20 అను బంద గ్రామాలున్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం 47,984 జనాభా ఉంది. 2025 వరకు సుమారు మొత్తం 65వేల జనాబా ఉన్నట్లు అంచనా రెండే బ్యాంకులతో రైతులు, వృద్ధులు, మహిళ సంఘాల సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలా మంది మండల వాసులు భైంసా పట్టణంలోని బ్యాంకులో ఖాతాలు ప్రారంభించి లావాదేవిలు చేస్తూ రుణాలు తీసుకుంటున్నారు. గత 11 ఏళ్ల కింద అప్పటి పాలకులు మండలంలో మరో బ్యాంకు ప్రారంభించి ఇబ్బందులు లేకుండా చూస్తామని హామి ఇచ్చిన ఇప్పటి వరకు ఏర్పాటు కాలేదు. ప్రభుత్వం రైతులకు పలు సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి వారి ఖాతాల్లో డబ్బులు జమ చేసిన ఖాతాలోని వివరాలు తెలుసుకోవడానికి రెండు మూడు రోజులు పడుతోంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు స్పందించి మరో నేషనల్ బ్యాంకు ఏర్పాటు చేసి మండల ప్రజలకు సేవలందించాలని కోరుతున్నారు.

● **నిత్యం రద్దితో తీవ్ర ఇబ్బందులు : సాప అనీల్, కుభీర్**



నెల రోజులకు ఒక సారి బ్యాంకుకు వచ్చినా ఎప్పుడు రద్దిగా ఉంటుంది. కనీసం ఖాతా వివరాలు చూసుకోవడానికి కూడా వీలు పడడం లేదు. చాలా సార్లు వచ్చి తిరిగి ఇంటికి వెళ్లా. పంటల డబ్బులు, రైతు భరోసా తదితర డబ్బులు ఖాతాలోనే జమ అవుతాయి. కుభీర్‌లో మరో కొత్త బ్యాంకు ఏర్పాటు చేసి ఇబ్బందుల్లేకుండా చూడాలి.

లబ్ధిదారులకు అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి

ముథోల్, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి) 29 : మండలంలోని ఆయా గ్రామాలల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు అవగాహన కల్పించాలని మండల ప్రత్యేక అధికారి సుదర్శన్ అన్నారు. మంగళవారం మండలాభివృద్ధి కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాలల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు ఇళ్లు నిర్మించుకునేలా వారికి అవగాహన కల్పించల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. సంబంధిత లబ్దిదారులకు మే 5 నుంచి ప్రొసిడింగ్‌లను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలు సలహా సూచనలు అందిచ్చారు. ఈ కార్యక్రమంలో యంపిడీవో శివకుమార్, ఏపీవో శిరీషారెడ్డి, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కోతకు గురైన బీటీ రోడ్డుతో ప్రమాదాలు

కుభీర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లె మలుపు వద్ద బీటీ రోడ్డు కోతకు గురయి తరచూ ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. తహసీల్దార్ కార్యాలయం ప్రభుత్వ ఉన్నత పాఠశాల , గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల, కేజీబీవీ బాలికల విద్యాలయానికి ప్రతి రోజు ఈ రోడ్డు గుండానే వందలాదిగా మండల వాసులు రాకపోకలు చేస్తారు. సంబంధితశాఖ అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

భూ భారతితో రైతులకు న్యాయం



నర్సాపూర్(జి), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : భూ భారతి చట్టం వలన రైతులకు న్యాయం జరుగుతుందని మండల తహసీల్దార్ సోమ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని బూరుగుపెల్లి గ్రామంలో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన భూ భారతి చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సదస్సుకు తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్‌స్పెక్టర్ సుమలత, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం

జిల్లా అధ్యక్షునిగా సుంచు శ్రీనివాస్

మామడ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్షులుగా సుంచు శ్రీనివాస్‌ను నియమించినట్లు జాతీయ ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం జాతీయ అధ్యక్షులు చెందాల లింగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సుంచు శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా అధ్యక్షునిగా ఎన్నిక కావడం పట్ల తనపై ఎంతో బాధ్యత పెట్టారని, తాను చేసిన పోరాటాలకు గుర్తుగా జాతీయ ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం నన్ను గుర్తించిందన్నారు. జాతీయ స్థాయిలో కూడా జిల్లా సమస్యలపై చర్చకు తీసుకువస్తామని అన్నారు.

నిరుపేదలకు అండగా సీఎంఆర్ఎఫ్ : ఆడే



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఆడే గజేందర్

నేరడిగొండ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు కొండంత అండగా సీఎంఆర్ఎఫ్ నిలుస్తుందని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని బోథ్ మండలానికి చెందిన ఇద్దరు లబ్ధి దారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. బోథ్ పట్టణ కేంద్రానికి చెందిన ఖలీల్ అహ్మద్‌కు రూ.60 వేలు, అదే విధంగా బోథ్ మండలంలోని నిగిని గ్రామానికి చెందిన రాథోడ్ ప్రదీప్‌కు రూ.37 వేలు విలువ గల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఆయనతో పాటు నాయకులున్నారు.

విధులను ఆటంక పరిచిన వారిపై కేసు

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ కార్యాలయం ఎదుట పలువురు నాయకులు పంచాయతీ కార్యాలయ సిబ్బంది విధులకు ఆటంకపరుస్తూ ధర్నా చేయడంతో వారిపై కేసు నమోదు చేశారు. జిల్లా పంచాయతీ అధికారి ఫిర్యాదుతో ఆదిలాబాద్ రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆరుగురితో పాటు మరికొందరిపై కేసు నమోదు చేశామని టూటౌన్ సీఐ కరుణాకర్ రావ్ తెలిపారు. సావర్గం గ్రామం తాంసి మండలంలో కాంట్రాక్ట్ పద్ధతులు విధులు నిర్వర్తిస్తూ ప్రమాదవశాత్తు మరణించిన ప్రభాకర్ శవంతో జిల్లా పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగి, విధులకు ఆటంకపరచినందుకు జిల్లా పంచాయతీ అధికారి శ్రీలత ఫిర్యాదుతో అన్నముల కిరణ్, బోజ్జ ఆశన్న, అలాలి అజయ్, లంక రాఘవులు, మల్లేష్, అగ్గిమల్ల స్వామితో పాటు మరి కొందరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

జిల్లా కలెక్టర్‌ను సన్మానించిన నాయకులు



కలెక్టర్‌ను సన్మానిస్తున్న రైతులు, నాయకులు

తలమడుగు , ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ ఇటీవల ప్రధానమంత్రి నుంచి అవార్డు తీసుకోవడంతో కలెక్టర్‌ను మంగళవారం సన్మానించారు. తలమడుగు మండలం ఉండం గ్రామంలో భూభారతి చట్టంపై అవగాహన సదస్సు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వచ్చిన జిల్లా కలెక్టర్ రాజార్షిషాను తలమడుగు మండల రైతులు స్వాగతించి సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని అవార్డులు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి బోజరెడ్డి, జెసి శ్యామల దేవి, మాజీ జెడ్పిటిసి గోక గణేష్ రెడ్డి, మాజీ ఎంపీపీ కళ్యాణం లక్ష్మి రాజేశ్వర్, తహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీవో శేఖర్, మాజీ ఎంపిటిసిలు మాజీ సర్పంచ్ రైతులు నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ యువజన విభాగం సమావేశం

నేరడిగొండ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ తెలంగాణ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యనిర్వాహక సమావేశం నిర్వహించారని నాయకులు తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా నేషనల్ యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కృష్ణ అలెవెరు, జాతీయ యువ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్ చిబ్‌లు హాజరై కీలక ప్రసంగం చేశారన్నారు. కార్యక్రమంలో అదిలాబాద్ జిల్లా యూత్ కాంగ్రెస్ ఇంచార్జిలు రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అల్మాస్ ఖాన్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి మధుకర్ యాదవ్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి శాంతన్ రావు, జిల్లా ఉపాధ్యక్షుడు పరమేశ్వర్ పాల్గొన్నారు.

మెస్ టెండర్ల ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదు

● ఆర్జీయూకేటీ వైస్ చాన్స్‌లర్ గోవర్ధన్

బాసర, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : మెస్ టెండర్ల ప్రక్రియ ఇంకా పూర్తికాలేదని, పరిశీలన దశలో ఉందని ఆర్జీయూకేటీ వైస్ చాన్స్‌లర్ గోవర్ధన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. మెస్ టెండర్లపై కొంత మంది లేనిపోని అసత్య ప్రచారాలు చేస్తున్నరని అన్నారు. టెండర్ ప్రక్రియలో భాగంగా మొదటి టెక్నికల్ రౌండ్ పూర్తి అయింది. రెండవది ఫైనాన్షియల్ రౌండ్ కొనసాగుతూ ఉందని వివరించారు. టెండర్ ప్రక్రియ అంతా సంబంధిత అధికారుల సమక్షంలో పారదర్శకంగా జరుగుతుందని చెప్పారు.

నిజాయితీ చాటుకున్న నిర్మల్ డిపో ఆర్టీసీ డ్రైవర్

నిర్మల్‌రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : బస్సులో మరిచిపోయిన ప్రయాణికుని ల్యాప్‌టాప్ బ్యాగును అందజేసి ఆర్టీసీ డ్రైవర్ నిజాయితీని చాటుకున్నట్లు డిపో మేనేజర్ పండరి తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.... నిర్మల్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని అమలాపురానికి వెళుతున్న బస్సులో హైదరాబాద్ వద్ద బస్సు ఎక్కి అమలాపురంలో దిగాడు. ప్రయాణికుడు బాహుజీ, టెక్ మహేంద్ర కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. రూ.80 విలువచేసే కంపెనీ ల్యాప్‌టాప్ మరిచిపోయి బస్సు దిగిపోయాడు. అమలాపురంలో బస్సు ఆపిన డ్రైవర్‌లు ఎమ్ఎస్‌మూర్తి, ఆదినారాయణ ల్యాప్‌టాప్‌ను గమనించి బ్యాగ్ విప్పి దానిలో గల ఐడీ కార్డుపై ఉన్న ఫోన్‌నంబర్‌కి ఫోన్ చేసి ప్రయాణికున్ని పిలిపించి ల్యాప్‌టాప్‌పై బ్యాగ్ అప్పగించినట్లు డ్రైవర్ తెలిపారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ డ్రైవర్‌ను అభినందించారు.

బూరుగుపెల్లి జొన్న కొనుగోలు కేంద్రంలో

గన్నీ బ్యాగుల కోసం పడిగాపులు

● వర్షంలో తడిసిపోతున్న జొన్నలు

నర్సాపూర్ (జి), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బూరుగుపెల్లి కె గ్రామంలో మంగళవారం జొన్న కొనుగోలు కేంద్రానికి వచ్చిన రైతులు గన్నీ బ్యాగుల కోసం పడిగాపులు కాశారు. మండలంలోని తురాటి, చాక్‌పెల్లి, డొంగూర్‌గాం, ఆర్లికె బామ్ని బి గ్రామాల రైతులు జొన్నలను పండించి కొనుగోలు కేంద్రానికి తీసుకు వస్తే గన్నీ బ్యాగులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందుకలు ఎదుర్కొంటున్నారు. మంగళశారం సాయంత్రం మూడు గంటల సమయంలో కురిసిన వర్షానికి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి వెంటనే తూకం వేయాలని రైతులు కోరుతున్నారు.

బస్టాండ్‌లో ప్రయివేటు వాహనాల తిష్ట

కుభీర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో ప్రైవేటు వాహనాలకు పార్కింగ్ కేంద్రంగా మారింది. దీంతో వాహనచోదకులకు, ప్రయాణికులకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం ఆయా ప్రాంతాలకు రాకపోకలు సాగించే వారు ప్రైవేటు వాహనదారులు తమ స్వంత స్థలంలో మాదిరిగా బస్టాండ్‌లో నిలిపి వెళ్లి పోతున్నారు. దీంతో పగలంతా వాహనాలు అక్కడే ఉంటున్నాయి. ప్రైవేటు వ్యక్తులు తమ వాహనాలు ఇష్టానుసరాంగా నిలిపివేసి వెళ్లి పోతున్నారు. దీంతో ప్రయాణ ప్రాంగణానికి వచ్చే మండల వాసులు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటకయిన సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



వర్షాకాలంలో కవ్వాల్ టైగర్ జోన్‌లో దట్టంగా కనిపిస్తున్న అడవులు



వర్షాకాలంలో దంతనపల్లి, బీర్సాయిపేట మధ్య అటవీ ప్రాంతంలో నీరు నిండుగా ఉన్న కుంట



వేసవికాలంలో కుంటలో నీరు అడుగంటిందిలా..

8 నెలలు కళకళ.. 4 నెలలు వెలవెల

● వన్యప్రాణులకు అడ్డాగా ఉట్నూర్ పరిధిలోని కవ్వాల్ టైగర్ జోనల్ ప్రాంతం ● వర్షాకాలంలో అడవుల్లోని కుంటల్లో నిండుగా నీరు ● ఎండాకాలంలో అడుగుంటిపోతున్న వైనం గుక్కెడు నీటి కోసం అల్లాడుతున్న ప్రాణులు ● వన్యప్రాణుల దాహార్తి తీర్చడానికి పలుచోట్ల సాసర్‌ల ఏర్పాటు



వర్షాకాలంలో ప్రధాన రహదారిపై కనిపిస్తున్న పచ్చని అడవులు

ఉట్నూర్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): వానాకాలం మొదలుకొని, శీతాకాలం వరకు ఎనిమిది నెలల పాటు పచ్చని అడవులతో కళకళాడుతున్న చెట్లు.. వేసవి కాలంలో నాలుగు నెలల పాటు వెలవెలబోతున్నాయి. ఉట్నూర్ మండలంలోని కవ్వాల్ టైగర్ జోనల్ ప్రాంతంలో ఉన్న బీర్సాయిపేట అడవుల్లో గత వర్షాకాలంలో లభించిన ఫొటోలను చూస్తే పచ్చని అడవులు దర్శనమిస్తుండగా.. మంగళవారం 'ఆంధ్రజ్యోతి' కెమెరా బంధించిన ఫొటోల్లో పచ్చని అడవులు వెలవెలబోతూ కనిపిస్తున్నాయి.

వన్యప్రాణులకు అడ్డాగా అడవులు

ఉట్నూర్ మండలంలోని టైగర్ జోనల్ ప్రాంతంలో ఉన్న అడవులు వన్యప్రాణులకు అడ్డాగా మారాయి. ఈ టైగర్ జోనల్ ప్రాంతంలోని ఉట్నూర్ వైపు నుంచి మంచిర్యాల వైపు బస్సులలో, జీపులలో, కార్లలో వెళ్లే ప్రయాణికులకు అడవులతోపాటు వన్యప్రాణులు కనువిందు చేస్తాయి. టైగర్ జోనల్ ప్రాంతంలో పులుల రాక కోసం వన్యప్రాణి విభాగం అధికారులు శాఖాహార జంతువులను పెంచారు. ఈ అభయారణ్యంలో పెద్ద పులులు, చిరుత పులులు, రేచి కుక్కలు, హైనాలు, నక్కలు, తోడేళ్లు, అడవి పిల్లలు, అడవి పందులు, ఏలుగు బంట్లు, చుక్కల దుప్పులు, కొండ గొర్రెలు, కుందేళ్లు, ముంగిసలు లాంటి జంతువులతోపాటు వన్యప్రాణులు ఉన్నాయి. టైగర్ జోనల్ ప్రాంతంలో నిర్మించిన చెరువులు, చిన్న చిన్న కుంటలు, చెక్ డ్యామ్‌ల్లో కూడా వేసవి కాలంలో నీరు అడగంటి పోతుండడంతో అడవుల్లో స్వేచ్ఛగా విహరించే జంతువులకు, వన్యప్రాణులకు నీటి కొరత తీర్చడానికి అటవీ శాఖ అధికారులు సాసర్లలో నీళ్ల ట్యాంకర్ల ద్వారా నీరు పెడుతున్నారు.





కవ్వాల్ అభయారణ్యంలో సాసర్ వద్దకు నీళ్ల కోసం చేరిన జింకలు



అటవీ శాఖ ఏర్పాటు చేసిన సాసర్ వద్ద దప్పిక తీర్చుకోవడానికి వచ్చిన జింకలు

టైగర్ జోనల్‌లో సాసర్‌లు ఏర్పాటు చేశాం

: అరుణ, ఎఫ్ఆర్‌వో, బీర్సపేట్



టైగర్ జోనల్ ప్రాంతంలోని అడవుల్లో వేసవికాలంలో వన్యప్రాణుల దాహార్తిని తీర్చడానికి ప్రత్యేక సాసర్‌లు ఏర్పాటు చేసి ట్యాంకర్ల ద్వారా నీటిని పోస్తున్నాం. అంతేకాకుండా బోర్ల వద్ద కూడా సోలార్ మోటార్లు ఏర్పాటు చేసి సాసర్లకు నీరు సరఫరా చేయడంతో జంతువులు, వన్యప్రాణుల దాహార్తి తీరుతుంది.

ఫటా..ఫట్...

వేసవి కాలంలో తగిన జాగ్రత్తలు పాటించాలి

● డా.వడ్నం వసుంధర, మండల వైద్యాధికారి, కుభీర్



ఎండా కాలం అనేక.. అనారోగ్య సమస్యలు వస్తాయి. వడదెబ్బ నీటిని తక్కువ శాతం తాగడంతో మూత్ర పిండాలకు ముప్పు వాటిల్లే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటే ఎండాకాలంలో అనారోగ్య సమస్యలను అధిగమించవచ్చో డా. వసుంధర పలు సూచనలు అందించారు.

ఆంధ్రజ్యోతి: వేసవిలో వ్యాధుల బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

వైద్యాధికారి వేసవిలో శరీరంలో నీటి శాతం కోల్పోకుండా జాగ్రత్త పడాలి. శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవాలి. ఎండాకాలంలో డీహైడ్రేషన్ కారణంగా కిడ్నీల్లో రాళ్లు ఏర్పడతాయి. ఈ సమస్య రాకుండా నీరు తాగడం శ్రేయస్కరం.

ఆంధ్రజ్యోతి: ఆరోగ్యకరమైన జీవనం కోసం ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి.

వైద్యాధికారి ఆరోగ్యంగా ఉండేందుకు వేసవిలో పుష్కలమైన నీళ్లు తాగాలి తద్వారా శరీరంలో డీహైడ్రేషన్ సమస్య నుంచి బయట పడే వీలుంది. పెయిన్ కిల్లర్స్ మాత్రలకు ఔషధాలకు దూరంగా ఉండాలి. వేళకు నిద్రలేవడం, వ్యాయామం, యోగా, నడకసాగించి నిత్యం 8గంటల పాటు నిద్రపోవాలి.

ఆంధ్రజ్యోతి: గ్రామీణ ప్రాంతాల్లో వడదెబ్బకు గురయిన వారికి ఎలాంటి ప్రథమ చికిత్స అందించాల్సి ఉంటుంది?

వైద్యాధికారి వడదెబ్బ బారీన పడ్డ వారికి ముందుగా చల్లని ప్రదేశానికి తరలించాలి. శరీరాన్ని తడి గుడ్డతో తూడుస్త ఓఆర్ఎస్ ప్యాకెట్లను మంచినీటిలో కలిపి తాగించాలి. తరువాత ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించాలి.

ఆంధ్రజ్యోతి: వేసవిలో ఎలాంటి ఆహార నియమాలు పాటించాలి?

వైద్యాధికారి: వేసవికాలం దృష్ట్యా గర్భిణులు పిల్లలు తేలికపాటి ఆహారం తీసుకోవాలి. ద్రవపదార్థాలు పండ్ల రసాలు, మజ్జిగ, ఆకుకూరలను తీసుకోవాలి. విటితో పాటు ఎండ వేడిమి నుండి ఉపశమనం కోసం ప్రోటీన్‌లు కలిగిన పదార్థాలను ఎక్కువ తీసుకోవడం శ్రేయస్కరం.

- కుభీర్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి)

అందని పరిహారం.. ఆందోళనలో రైతులు!

కుంటాల, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): అన్నదాతలు ఆరుగాలం కష్టపడి వివిధ రకాల పంటలు పండిస్తే.. ప్రమాదవశాత్తు వారికి నష్టం జరిగినప్పుడు ప్రభుత్వం ఆదుకొని సాయం చేయాల్సి ఉంది. కానీ అధికారుల నిర్లక్ష్యమో? సంబంధిత శాఖల అధికారుల అలసత్వమో? గత కొద్దిరోజుల నుంచి రైతులకు ఎలాంటి ఆర్థిక సాయం అందడం లేదు. కుంటాల మండలంలోని చాలా గ్రామాలలో రైతులు వ్యవసాయాన్ని నమ్ముకొని బతుకుతున్నారు. ప్రతియేటా రైతులు రబీ సీజన్‌లో చాలా వరకు మొక్కజొన్న పంటను సాగు చేస్తుంటారు. అయితే మొక్కజొన్న పంట కంకి దశలో ఉన్నప్పుడు అడవి జంతువులైనటువంటి పందులు, మనుబోతులు, తదితర జంతువులు పంటను నష్టపరుస్తుంటాయి. వాటిని కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతుంటారు.

అయినప్పటికీ చాలా వరకు పంట నష్టం జరుగుతోంది. ప్రభుత్వం నుంచి వారికి ఎలాంటి సాయం అందడం లేదంటున్నారు. వాస్తవానికి రైతులకు ప్రకృతి వైపరీత్యాలు, అడవి జంతువులు, విద్యుత్ ప్రమాదం ద్వారా రైతులు నష్టపోతే పరిహారం అందించాల్సి ఉంటుంది. కానీ ఈ విషయమై అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులకు పరిహారం అందడం లేదు. కుంటాల మండలంలోని చాలా గ్రామాలలో ఈ ఏడాది అడవి పందులతో పాటు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ద్వారా మొక్కజొన్న పంటలు సైతం కాలిపోయిన ఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతుకు సంబంధించిన ఏదైనా పంటకు నష్టం జరిగితే సత్వరమే పరిహారం అందించేందుకు ఉన్నతాధికారులకు నివేదించి రైతుకు న్యాయం చేయాల్సి ఉంది.

రెండెకరాల్లో మొక్కజొన్న కాలిపోయింది

: ముకుంద్ గంగాధర్, లింబా(కే) గ్రామం, కుంటాల మండలం



ఆరుగాలం కష్టపడి ఎండనక.. వాననక మొక్కజొన్న పంట పండిస్తే ఇటీవల ప్రమాదవశాత్తు కాలిపోయింది. నాకు ఉన్న రెండు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశారు. అయితే ప్రమాదవశాత్తు కాలిపోయి లక్ష రూపాయల వరకు నష్టం జరిగింది. అధికారులు స్పందించి న్యాయం చేయాలి.



కుంటాలలో ప్రమాదవశాత్తు ఇటీవల కాలిపోయిన మొక్కజొన్న పంట (ఫైల్)



..రబీ సీజన్‌లో అడవి పందుల దాడిలో ధ్వంసమైన మొక్కజొన్న పంట (ఫైల్)

అగ్నిమాపక శకటం ఏర్పాటు ఎప్పుడో!?

● ముథోల్ పరిధలో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీవ్ర ఆస్తి నష్టం ● బైంసా నుంచి శకటం వచ్చేలోపు నష్టం జరిగిపోతున్న వైనం

ముథోల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లో అగ్నిమాపక శకటం ఏర్పాటు చేసేది ఎన్నడు? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అగ్నిమాపక శకటం ముథోల్‌లో ఏర్పాటు చేయక పోవడంతో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీవ్ర ఆస్తి నష్టం జరిగిన సంఘటనలు ఉన్నాయి. ఏదైన అగ్ని ప్రమాదం జరిగినప్పుడు భైంసా నుంచి శకటం వచ్చేలోపు జర్గాల్సిన నష్టం జరిగిపోతోందంటున్నారు. కొన్ని ఏళ్ల నుంచి ముథోల్‌లో అగ్ని మాపక శకటంను ఏర్పాటు చేయాలని పలుమార్లు నాయకులకు, అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ముథోల్‌లో శకటం ఏర్పాటు చేసినట్లైయితే ముథోల్‌తో పాటు లోకేశ్వరం, తానూర్, బాసర, మండలాలకు అందుబాటులో ఉంటదని అంటున్నారు. అంతేకాకుండా పేరుకు ముథోల్ నియోజకవర్గ కేంద్రమే. కాతినీ అన్ని సమస్యలు రాజ్యమేలతున్నా.. వాటి పరిష్కారానికి ఎవతిరూ మార్గం చూపుతలేరని అంటున్నారు. అగ్ని ప్రమాదాలు జరిగినపుడు పెద్దమొత్తంలో ఆస్తి నష్టం జరుగుతున్న ఎవరూ పట్టించుకోకపోవడం లేదని మా గోస ఎవరూ పట్టించుకోరా? అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, పాలకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లో అగ్ని మాపక శకటం ఏర్పాటు చేయాలని ముథోల్ ప్రాంత ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.



ముథోల్ గ్రామం

అగ్నిమాపక శకటం లేక ఇబ్బందులు

: బండారి గంగాధర్, మాజీ ఎంపీటీసీ, తరోడ



నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లో అగ్నిమాపక శకటం ఏర్పాటు చేయాక పోవడంతో అగ్ని ప్రమాదాలు జర్గినప్పుడు బారి స్థాయిలో ఆస్తి నష్టం సంబవిస్తుంది.పలు మార్లు అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదు.ఇప్పటికైన ఉన్నతధికారులు స్పందించి ముథోల్‌లో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలి.



పిప్పల్‌కోటి శివారులో అరక దున్నుతున్న విద్యార్థులు



ప్రకృతి ఒడిలో విందు భోజనం ఆరగిస్తూ..

వేసవి సెలవుల్లో అరకతో విద్యార్థుల ఆటలు

భీంపూర్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించింది. విద్యార్థుల్లో ఆనందోత్సహాలు వెల్లువిరుస్తున్నాయి. కొంతమంది విద్యార్థులు దేవస్థాన సందర్శనకు వెళ్లగా.. మరికొందరు వారి బంధువులు, స్నేహితుల ఇళ్లకు వెళ్లారు. స్థానికంగా ఉన్న మరికొందరు వారి పంట పొలాల్లోకి వెళ్లి ఆటలాడుతున్నారు. మండలంలోని పిప్పల్‌కోటి గ్రామంలోని యువ రైతు ఎలువుల సందీప్ పిల్లలు తమ పొలంలోకి వెళ్లి వ్యవసాయ పనులతో ఆడుకుంటున్నారు. ఎద్దులకు అరక కట్టి పంట పొలాన్ని రోపుతున్న విద్యార్థులు వారిని చూసి పలువురు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.



మత్తు పదార్థాలు విక్రయిస్తున్న ఇద్దరి బైండోవర్

నిర్మల్‌రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : మత్తు పదార్థాల కేసులో ఇద్దరిని రూరల్ తహసీల్దార్ సంతోష్‌కు మంగళవారం బైండోవర్ చేసినట్లు ఎస్ఐ లింబాద్రి తెలిపారు. మండలంలోని విశ్వనాథ్‌పేట్‌లో గల పాన్‌షాప్‌లో ఇద్దరు గంజాయి అమ్ముతున్నారని సమాచారం రాగా.. ఏఎస్పీ రాజేశ్ మీనా టీం తోని అక్కడికి చేరుకొని పాన్‌షాపులను తనిఖీ చేసి షేక్‌కమర్, షేక్‌సోహెల్‌లను అదుపులోకి తీసుకున్నారు. జిల్లా ఎస్పీ జానకీ షర్మిల ఆదేశాల మేరకు తహసీల్దార్ ముందు బైండోవర్ చేసినట్లు తెలిపారు. భవిష్యత్‌లో ఎలాంటి మత్తు పదార్థాలు అమ్మకూడదని తహసీల్దార్ హెచ్చరించారు. అమ్మితే శిక్ష తప్పదన్నారు.



దిశా నిర్దేశం



కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ పరిశీలకుడు చంద్రశేఖర్‌గౌడ్

- కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపిన సమావేశం
- గ్రూపులకు అతీతంగా జిల్లా నేతలంతా హాజరు
- భవిష్యత్ కార్యాచరణపై పకడ్బందీ వ్యూహరచన
- ఇక ప్రతిపక్షాలపై అమీతుమీకి కాంగ్రెస్ సిద్ధం
- పథకాలపై గ్రామాల్లో విస్తృత స్థాయిలో ప్రచారం
- సోషల్ మీడియా వేదిక మరింత పటిష్ఠం



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకుడు అవేజ్

నిర్మల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర తరువాత కాంగ్రెస్ పార్టీ జిల్లా కేంద్రంలో నిర్వహించిన పార్టీ కార్యవర్గ సమావేశం శ్రేణులకు దిశానిర్దేశం చూపిందని అంటున్నారు. ఏడాదిన్నర కాలం నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దఎత్తున సంక్షేమ అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నట్లు ఆ పార్టీ నేతలు చెబుతున్నప్పటికీ ప్రతిపక్ష బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు మాత్రం ఈ ప్రచారాన్ని తిప్పికొట్టే రీతిలో విమర్శలు చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ శ్రేణులకు పెద్దఎత్తున ఉత్సాహం నింపే కార్యాచరణ ఇప్పటి వరకు ఆ పార్టీ తరఫున జరగలేదు. దీంతో కార్యకర్తలు కొంత అసంతృప్తితో ఉన్నట్లు అంతటా ప్రచారం జరుగుతోంది. దీనికి తోడుగా పార్టీ నేతలు సైతం గ్రూపులుగా విడిపోయి ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరిస్తున్నట్లు కూడా ప్రచారం ఉంది. నేతల భిన్న వైఖరిలతో సీనియర్ నేతలు గత కొద్ది రోజుల నుంచి తీవ్ర అసంతృప్తితో కొనసాగుతున్నారు. మరికొద్ది రోజుల్లోనే స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతుండడం, నాయకుల మధ్య భిన్నాభిప్రాయాలు కొనసాగుతుండడం, కార్యకర్తలంతా డైలామాలో ఉన్న ఈ సమయంలో కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం జిల్లా స్థాయిలో ప్రాధాన్యతతో కూడిన కార్యవర్గ సమావేశాల నిర్వహణకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా స్థాయి కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశానికి పార్టీ రాష్ట్ర పరిశీలకులు చంద్రశేఖర్‌గౌడ్, అవేజ్ ముఖ్యఅతిథులుగా హాజరై ఇటు నేతలకు అటు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా కార్యకర్తల్లో గందరగోళాన్ని తొలగించడం, నేతల మధ్య ఐక్యత నెలకొల్పడం లాంటి అంశాలపైనే కాకుండా పార్టీ పరంగా నిర్వహించే కార్యక్రమాలు, ప్రతిపక్ష బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొట్టడం లాంటి అంశాలపై ఇక నుంచి పకడ్బందీగా ముందుకు పోయే దిశగా కార్యచరణను నిర్దేశించారు. ఈ సమావేశాల నివేదికలను పార్టీ అగ్రనేతలైన సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జున్ ఖర్గేలకు అందజేయనున్నట్లు పరిశీలకులు ఇక్కడి నాయకులకు, శ్రేణులకు స్పష్టం చేశారు. ముఖ్యంగా 2017 సంవత్సరం నుంచి పార్టీలో కొనసాగుతున్న వారందరికి రాబోయే రోజుల్లో అత్యధిక ప్రాధాన్యతను కల్పించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు ఈ సమావేశంలో సంకేతాలు పంపారు. అలాగే నేతలంతా తమ గ్రూపు విభేధాలను, ఆధిపత్య ధోరణులను వీడి ఇక నుంచి కలిసికట్టుగా ఉండాలని అలాగే రాబోయే మున్సిపల్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ పదవుల కోసం జరిగే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను, సానుభూతి పరులను మెజార్టీ సంఖ్యలో గెలిపించుకోవడమే లక్ష్యంగా పెట్టుకుంటూ ముందుకు సాగాలని ఈ సమావేశం కేడర్‌కు దిశానిర్దేశం చేసింది. ఈ సమావేశానికి నిర్మల్‌తో పాటు ముథోల్, ఖానాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాల ముఖ్యనేతలు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ బాధ్యులు హాజరు కావడం కేడర్‌లో ఉత్సాహం నింపింది.



ఎస్సీ సామాజికవర్గాన్ని కించ పరుస్తున్నారని ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకులు సత్యనారాయణ

కేడర్‌కు పూర్తి భరోసా..

నిర్మల్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సమావేశం ఆ పార్టీ కేడర్‌లో పూర్తి భరోసా నింపిందని అంటున్నారు. ఇప్పటి వరకు జిల్లా పార్టీ వ్యవహారాలపై అధిష్ఠానం ఆశించిన రీతిలో దృష్టి కేంద్రీకరించడం లేదన్న అభిప్రాయాలు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. పార్టీ పరమైన కార్యక్రమాల నిర్వహణతో పాటు నేతల వ్యవహార శైలితో కార్యకర్తలు కొంత మేరకు అసంతృప్తితో ఉన్నట్లు చెబుతున్నారు. అయితే ఇప్పటికే పీసీసీ అధిష్ఠానానికి జిల్లా పార్టీ వ్యవహారాలను తీసుకుపోయినప్పటికీ.. ఇప్పటివరకు ఆశించిన రీతిలో స్పందన కనిపించలేదని చెబుతున్నారు. అయితే ఈ సమావేశం ద్వారా పార్టీ అధిష్ఠానం జిల్లా వ్యవహారాలను సీరియస్‌గానే గమనిస్తున్నట్లు సంకేతాలు వెలువరించారు. ఇప్పటి వరకు డైలామాలో ఉన్న పార్టీ కార్యకర్తలు ఊపిరి పీల్చుకున్నారు. పార్టీ అధిష్ఠానం కార్యకర్తలందరికీ అండగా నిలుస్తుందని భరోసా లభించడంతో ఆ పార్టీ కేడర్‌లో కొత్త ఉత్సాహం నెలకొందని అంటున్నారు.

ప్రతిపక్షాలపై అమీతుమీ.. పథకాలపై విస్తృత ప్రచారం

గత కొంతకాలం నుంచి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రతిపక్ష పార్టీలు ప్రజల్లో తప్పుడు సంకేతాలు పంపే విధంగా చేస్తున్న ఆరోపణలను బలంగా తిప్పికొట్టాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు సూచనలు జారీ అయ్యాయి. ఆరు గ్యారెంటీల అమలుతో పాటు ప్రభుత్వం విద్య, వైద్య రంగాల కోసం చేస్తున్న కృషిని అలాగే ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న కార్యక్రమాలపై ఇక గ్రామస్థాయి నుంచి పకడ్బందీ ప్రచారం చేపట్టేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతోంది. ప్రతిపక్షాలకు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా గడప గడప ప్రచారం కోసం సన్నద్ధమవుతోంది. ఈ దిశగా కార్యకర్తలంతా గ్రామస్థాయి నుంచి ఇంటింటా ప్రచారాన్ని చేపట్టేందుకు మండల స్థాయిలో కార్యాచరణ రూపొందించనున్నారు. ఈ కార్యాచరణ ప్రకారం సంస్థాగత బాధ్యులంతా పల్లె పర్యటనలు చేపట్టి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించనున్నారు. ప్రతిపక్షాలు చేసే విమర్శలపై ఎక్కడికక్కడ ఎప్పటికప్పుడు ఎండగట్టేందుకు ఇటు నాయకులు అటు సాధారణ కార్యకర్తలు సైతం సిద్ధంగా ఉండాలంటూ అధిష్ఠానం జారీ చేసిన సూచనలు ఆ పార్టీలో ఉత్సాహం నింపనున్నాయి.



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు

ఇకపై సోషల్ మీడియా వేదికగా పటిష్ఠం

ప్రజలకు అత్యంత చేరువైన సోషల్ మీడియాను కాంగ్రెస్ పార్టీ ప్రధాన అస్త్రంగా మలుచుకోబోతుంది. ఇప్పటికే బీఆర్ఎస్, బీజేపీల సోషల్ మీడియా వేదికలు కాంగ్రెస్ పార్టీపై తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజల్లో నెగెటివ్ భావనలు పెంపొందిస్తున్నట్లు ఆ పార్టీ గుర్తించింది. దీనికి అనుగుణంగానే ఇక నుంచి సోషల్ మీడియా విభాగాన్ని మరింత పటిష్ఠం చేసి బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు ఎప్పటికప్పుడు కౌంటర్ చెక్ పెట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో భాగంగానే గ్రామ, మండలస్థాయి నుంచి కాంగ్రెస్ సోషల్ మీడియా విభాగాలను సంస్థాగత ఎన్నికల సందర్భంగా ఖరారు చేయబోతున్నారు. సోషల్‌మీడియా బాధ్యులకు రాష్ట్రస్థాయిలో శిక్షణలు ఇచ్చి వారికి ప్రచార అస్త్రాలను అందించనున్నారు. ఫేస్‌బుక్, వాట్సాప్, టెలిగ్రామ్, ఎక్స్ ఇన్‌స్ట్రాగ్రామ్ లాంటి సోషల్ మీడియా వేదికలను ఇక నుంచి ఆ పార్టీ నాయకులు పూర్తిస్థాయిలో వినియోగించుకోబోతున్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే చట్ట ప్రకారం చర్యలు

- తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చిన ఎస్పీ జానకీ షర్మిల



మైనర్లు, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తున్న జిల్లా ఎస్పీ

నిర్మల్ రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రుల మీద చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ జానకీ షర్మిల అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం 91 మంది మైనర్లకు, 107 మంది తల్లిదండ్రులకు జిల్లా ఎస్పీ, అదనపు ఎస్పీ కౌన్సిలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రాత్రి వేళల్లో హోటళ్లలో, దాబాల్లో మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రహించి ఇందులో భాగంగానే గతంలో దాబాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం జరిగిందని, అదే విధంగా ఆదివారం మైనర్ డ్రైవింగ్‌లపై స్పెషల్ డ్రైవ్ చేయడం జరిగిందన్నారు. తల్లిదండ్రులు మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని, ఇందుకే ఇప్పుడే రెండుసార్లు కౌన్సిలింగ్ ఇచ్చి వాహనాలు ఇస్తునాన్నమన్నారు. మళ్ళీ ఇలా ఈ తప్పు చేసే తల్లిదండ్రులపై, వాహన యజమానులపై చట్ట పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఉపేందర్‌రెడ్డి, ఆర్ఐలు నిరంజన్‌రావు, శేఖర్, రమేష్, రామకృష్ణ, ఆర్ఎస్ఐలు, పట్టుబడిన మైనర్లు, వారి తల్లిదండ్రులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఖానాపూర్ ప్రాంతంలో

విధి నిర్వహణ మరువలేని అనుభూతి

- న్యాయాధికారి జితిన్‌కుమార్



వీడ్కోలు సమావేశంలో న్యాయాధికారి జితిన్‌కుమార్‌తో ఖానాపూర్ న్యాయవాదులు

ఖానాపూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ ప్రాంతంలో విధి నిర్వహణ మరువలేని అనుభూతినిచ్చిందని న్యాయాధికారి జితిన్‌కుమార్ అన్నారు. హైదరాబాద్‌కు బదిలీపై వెళుతున్న జితిన్ కుమార్‌కు ఖానాపూర్ కోర్టు హాలులో న్యాయవాదులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందరర్భంగా ఆయనను గజమాలతో సత్కరించారు. అనంతరం జడ్జీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏజీబీ ఆసిఫ్ అలీ, న్యాయవాదులు మట్టెరి శేఖర్, వెంకట మహేంధ్ర, భాశెట్టి శివ, వెంకటేశ్, కమలాకర్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు బుక్‌ర్యాక్స్



ముథోల్,ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి) 29: ముథోల్ ఐసీడీఎస్ ప్రాజెక్టుకు మంగళవారం బుక్ ర్యాక్స్ (పుస్తకాల అల్మారాలు) 80 వచ్చినట్లు సీనియర్ అసిస్టెంటు విజయ్‌కుమార్ తెలిపారు. గతంలో వచ్చిన 74 బుక్‌ర్యాక్స్‌లను అంగన్వాడీ సెంటర్లకు పంపిణీ చేశామన్నారు. మంగళవారం వచ్చిన 80 త్వరలోనే ఆయా అంగన్వాడీ సెంటర్లకు పంపిణీ చేయనున్నట్టు ఆయన తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి

- కలెక్టర్ అభిలాష అభినవ్

కుంటాల, ఏప్రిల్, 29 : (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి భూముల యొక్క సమస్యలను పరిష్కారంచాలనే ఉద్దేశంతోనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి పథకాన్ని ప్రవేశపెట్టిందని నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మంగళవారం కుంటాల మండలంలోని అందకూర్ గ్రామంలో భూ భారతి పథకంపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమెతో పాటు అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలో భూమిలేని రాష్ట్రం లేదని అంతేగాకుండా భూ సమస్యలు కూడా ప్రతిచోట ఉన్నాయని ఇలాంటి సమస్యలు మరీ మరీ పునరావృతం కాకుండా చూడాలనే ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ భూ భారతి పథకాన్ని ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా రైతులకు సంబంధించిన భూముల సమస్యలన్నీ పరిష్కారం అయ్యే అవకాశం ఉందన్నారు. సాదాబైనామాల ద్వారా ధరణి పోర్టల్‌లో భూ సమస్యలు పరిష్కారమయ్యేవి కావని, ప్రస్తుత భూ భారతి పథకం ద్వారా గ్రామాల్లో విచారణ జరిపి సాదాబైనామాలో అర్హులైన వారికి న్యాయం చేయడం జరుగుతుందన్నారు. అంతేగాకుండా ధరణి పోర్టల్ వల్ల నష్టం జరిగిన రైతులకు భూ భారతి పథకంతో సమస్య పరిష్కారమై లాభం చేకూరే అవకాశం ఉందన్నారు. గతంలో మాదిరి కాకుండా ప్రస్తుతం నూతన పట్టా పాసు పుస్తకం విడుదలయ్యే రైతులకు వారి పంట భూమి మ్యాప్ ఆధారంగా పాసు పుస్తకం అందజేయడం జరుగుతుందన్నారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి జిల్లాలో అన్నిమండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం భూ భారతి పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, రాబోయే రోజుల్లో రెవెన్యూ సదస్సుల్లో రైతులకు సంబంధించిన అన్ని రకాల రెవెన్యూ సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు ఈ సందర్భంగా అందకూర్ గ్రామంలో పలువురు రైతుల సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు సంబంధించిన సమస్యలన్నింటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కమల్ సింగ్, ఎంపీడీఓ లింబాద్రి, వ్యవసాయ అధికారి విక్రమ్, ట్రాన్స్‌కో ఏఈ మధు, డిప్యూటీ తహసీల్దార్ నరేష్‌గౌడ్, ఏపీఎం అశోక్, ఏపీవో నవీన్, ఎంపీవో రహీంతో పాటు పలు శాఖల అధికారులు, గ్రామస్తులు ఉన్నారు.



కుభీర్ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

కుభీర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : భూభారతితో రైతుల భూసమస్యలు సులువుగా పరిస్కారమవుతాయని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన కుభీర్‌లోని రైతువేదికలో ఏర్పాటు చేసిన భూభారతి ఆర్‌వోఆర్ చట్టంపై అవగాహన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తాజాగా చేపట్టిన భూభారతి ద్వారా తాజాగా చేపట్టిన భూభారతి ద్వారా హక్కుల రికార్డుల సవరణ మార్పులు జరుగుతాయని, క్షేత్ర స్థాయిలోనే సమస్యలు పరిష్కారం అవుతయాన్నారు. వారసత్వంగా వచ్చిన భూములపై మ్యూటేషన్ చేసేముందు నిర్ణీత కాలవ్యవధిలో విచారణ జరుగుతుందన్నారు. ఏమైన తప్పిదాలు జరిగితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటారని అన్నారు. ఎప్పుడు లేని విధంగా రైతుకు గల భూమి చిత్రాన్ని పట్టపాసుపుస్తకంలో పొందుపరుస్తారని పేర్కొన్నారు. భూ సమస్యల పరిష్కారానికి సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. త్వరలోనే గ్రామాల్లో రెవెన్యూ సభలు నిర్వహిస్తామని రైతులు తమ భూసమస్యలను దరకాస్తులు చేసుకోవాలన్నారు. అంతకు ముందు తహసీల్దార్ శివరాజ్, గిర్దావార్ నరేష్ భూభారతి చట్టంలో పొందుపరిచిన విషయాలను చదివి వినిపించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, మండల ప్రత్యేక అధికారి శంకర్, తహసీల్దార్ శివరాజ్, ఎంపీడీవో నవనీత్, అధికారులు, ప్రజలు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ ఉపాధి హామీ ప్రజావేదికలో

అవినీతికి పాల్పడిన ఇద్దరు మేట్ల తొలగింపు

- సొత్తును రికవరీ చేసిన జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్



సామాజిక తనిఖీలో పనులను వెల్లడిస్తున్న తనిఖీ బృందం

సారంగాపూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 32 గ్రామపంచాయతీల్లో ఉపాధిహామి పథకంలో చేపట్టిన పనులపై మంగళవారం మండల కేంద్రంలో గల మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉపాధిహామీ ప్రజావేదికను నిర్వహించారు. ఈ నేపథ్యంలో 2024-2025 సంవత్సరంలో జరిగిన ఉపాధిహామిలో రూ. 14కోట్లతో పనులు చేపట్టినట్లు సభలో సమాజ తనిఖీ బృందం వెల్లడించారు. మండలంలోని అరకాయి తండా, కౌట్ల(బి) గోపాల్‌పెట్, యాకర్‌పెల్లి, ఆలూర్, దని, గ్రామాలతో పాటు తదితర గ్రామాలలో ఎన్ఆర్ఈజీఎస్‌ల చేసనిటువంటి డ్రైనేజీ సీసీ రోడ్లు పనులతో పాటు చెరువుల కందకాల పూడికతీత పనుల వివరాలను ప్రజావేదికలో సంబంధిత అధికారులు చదివి వినిపించారు. రిజిస్టార్‌లో కూలీలు సంతకాలు లేకుండా బినామి పేర్ల మీద కూలీల డబ్బులను ఇద్దరు మేట్లు కాజేయం జరిగిందని తనిఖీ బృందం సభ దృష్టికి తీసుకువెళ్లడంతో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ వెంటనే స్పందించి ఇద్దరు మెట్‌లను తొలగించడంతో పాటు జరిమానాను విధించారు. కొన్ని గ్రామాలలో నిర్వహించిన పనులలో అవకతవకలు జరగడంతో పాల్పడిన వారిపై చర్యలు తీసుకొని కాజేసిన డబ్బులను రికవరీ చేశారు. జాతీయ ఉపాధిహామిలో రహదారి చుట్టూ పక్కల పెట్టిన మొక్కలను నీరు అందక మొలకెత్తక పోవడంతో ఉపాధిహామి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ ఉపాధిహామి పనులలో అవకతవకలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని ప్రజావేదికలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఆదేశాలను చేశారు. ఈ ప్రజావేదికలో ఏపీడీ నాగవర్ధన్, ఎంపీడీవో లక్ష్మీకాంతరావు, ఎంపీవో అజిజ్‌ఖాన్, ఏపీవో లక్ష్మారెడ్డి, ఎస్టీఎం దత్తు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామి సిబ్బంది ఉన్నారు.

ఆరెంజ్ జోన్‌లో జిల్లా

ఖానాపూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ఉష్ణోగ్రతలు భారీగా నమోదు అవుతుండడంతో నిర్మల్ జిల్లాలో అధికారులు ఆరెంజ్ అలెర్ట్‌ను జారీ చేశారు. మంగళవారం జిల్లాలోని దస్తూరాబాద్‌లో 44.3 ఉష్ణోగ్రతలు నమోదు కాగా.. అత్యల్పంగా సారంగాపూర్ మండలంలో బీరవెల్లిలో 41.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉష్ణోగ్రతలు భారీగా నమోదు కావడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

డిగ్రీ ప్రవేశాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్‌రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మహత్మ జ్యోతిబా పూలే బీసీ బాలుర సంక్షేమ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ విభాగాల్లో వివిధ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇంటర్ పూర్తయిన విద్యార్థులు మే 5వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

కుభీర్ తహసీల్దార్‌గా శివరాజ్



కుభీర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : మండల తహసీల్దార్‌గా మంగళవారం శివరాజ్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన రాంచందర్ బదిలీపై వెళ్లగా నిర్మల్ కలెక్టరేట్ నుండి శివరాజ్ బదిలీపై వచ్చారు. ఆయనను రెవన్యూ సిబ్బంది ఘనంగా స్వాగతించారు. మండల అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని నూతన తహసీల్దార్ శివరాజ్ పేర్కొన్నారు.

ఒకరి బైండోవర్..

నర్సాపూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో మంగళవారం శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన ఒకరిని పోలీసులు బైండోవర్ చేశారు. మండల కేంద్రానికి చెందిన షేక్ సమీరుద్దిన్‌ను తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ముందు బైండోవర్ చేశారు. మరోసారి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే లక్ష జరిమానా విధిస్తామని తహసీల్దార్ తెలిపారు.

ఓలాలో చలివేంద్రం ప్రారంభం



ఓలా గ్రామంలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

కుంటాల, ఏప్రిల్, 29 : (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓలా గ్రామంలో మంగళవారం వాసర సరస్వతీ శిశు మందిర్ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్‌లో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మాజీ సర్పంచ్ ఖనీష్ ఫాతిమా, పంచాయతీ సెక్రటరీతో గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 15 సంవత్సరాల నుండి పాఠశాల నిర్వాహకులు లోలం గజేందర్ ఆధ్వర్యంలో చలి వేంద్రం ఏర్పాటు చేసి ప్రయాణికుల దాహార్తి తీర్చడం అభినందనీయమన్నారు ఈ కార్యక్రమంలో గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

తానూర్ సమాఖ్య

నూతన కార్యవర్గం ఎన్నిక



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

తానూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : మండల సమాఖ్య నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నట్లు ఏపీఎం నారాయణ్‌రెడ్డి తెలిపారు. మండల సమాఖ్య కార్యాలయంలో మహాజన సభ నిర్వహించి 2024-25 సంవత్సరంలో చేసిన అభివృద్ధిపై చర్చించి అదే విధంగా 2025-26 సంవత్సరంలో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలపై వివరించడం జరిగిందన్నారు. అనంతరం నూతన మండల సమాఖ్య కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. అధ్యక్షురాలుగా పి. మంగళ, కార్యదర్శిగా పద్మ , కోశాధికారిగా సరోజన, ఉపాధ్యక్షురాలిగా ఎం పోసాని, సహకార్యర్శిగా శాంతాలను ఎంపిక చేసుకోవడం జరిగిందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సీసీలు భోజన్న, సాయినాథ్, సవిత, అకౌంటెంట్ ధాత్రి, ఆపరేటర్ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.